# మానస

# 3

రైలు తన దారిన తాను వెళ్ళిపోతోంది. తన గమ్యస్థానం తెలుసు కనక అక్కడికి చేరే తొందరలో పరుగులు పెడుతోంది.

కొత్తలో. రైలులో దూరప్రయాణాలు చేసే ఉత్సాహం తగ్గిపోని రోజుల్లో _ అనిపించేది. రైలు పరుగు జీవితపు పరుగు లాటి దేనని. ఒక చోటునించి ఇంకొకచోటుకి వెళ్ళడం ఆ ప్రయాణంలో అముఖ్యమైన భాగం. ఆ ప్రయాణమే ఒక పులకరింత. అదే ఒక అనుభూతి.

కాని. రైళ్ళలో తిరిగి తిరిగి. జీవితం చూసి చూసి. నా ఉద్దేశాలన్నీ మారిపోయాయి. రైలు ప్రయాణాలు అంటే చిరాకుపుట్టి. కొత్తఊరికి—పోవాల్సిన ఊరికి పోవడమే ధ్యేయం అయిపోయింది. దీనికీ, వయస్సుకీ సంబంధం ఉందని కాదు....వయస్సుకీ, అనుభవానికీ సంబంధం లేనట్టే, ఇక్కడా ఏమీ సంబంధం లేదు. అయితే కొద్ది సంవత్సరాల్లో విచిత్రంగా నాకు ఎన్నో అనుభవాలు కలిగాయి.

గాలిలో ఎగురుతుంటే నేలమీద గతుకులు అనుభవానికి రానట్టే. బాధపడే మనసులు లేని వాళ్ళకీ. సున్నితమైన మానసిక ప్రవృత్తులు లేని వాళ్ళకీ. అనుభవా లెన్ని కలిగినా, అవి తాత్కాలికంగా వాళ్ళని బాధించో. సంతోషపరిచో, మరుగున పడిన జ్ఞాపకాలలోకి జారిపోయి మళ్ళీ వెలికి రావు....తుఫానులేని సముద్రం మీద పెద్ద నావలో ప్రయాణం ఆ అదృష్టజీవులది.

కానీ, ప్రతీ మందమారుతానికీ ఊగే చిగురాకుల్లాటి మనసులకి అనుభూతుల్లో బాధలే కాని, ఆనందాలు ఉండవు. విరామయంగా సాగిపోతోన్న కాలంలో వాళ్ళదుఃఖాలకి శాశ్వతత్వమూ. సుఖాలకీ

ఆనందాలకీ అశాశ్వతత్వమూ, ఈ తరగతివాళ్ళని ఎప్పుడూ బాధ పడే మనసులతోనే ఉండనిస్తాయి.

నా కనిపిస్తుందీ, నేను ఒద్దనుకుంటూనే ఈ తరగతి మని షిగా అయిపోయా నని. లేకపోతే ఎప్పటివో, మరువరాని అందమైన నల్లటి కళ్లు, అన్ని అనుభూతుల తరవాతా, నా కంత దగ్గరగా వొచ్చి, అంత ఆనందం ఇచ్చి, దూరమై, ఇంతకాలం తరవాతా నాలో ఏదో పోగొట్టుకున్న బాధ ఎందుకు కలిగించాలి? ఎప్పుడో, ఎక్కడో చూసిన రెండు కన్నీటి బిందువులు తరుచూ జ్ఞాపకం వొచ్చి, ఆ మనిషి ఎవరో తెలియక పోయినా, ఎందుకని ఏడిపిస్తాయి?

జ్ఞాపకాలు....

జ్ఞాపకాలు.

తేనెచుట్టూ ఈగల్లాగ.

ఉండి బాధ పెడతాయి.

లేకా, బాధపెడతాయి!

రైలు ఉండీ ఉండీ ఆగుతోంది. బయట వికారంగా, అశు భ్రంగా స్టేషన్లు. ఇనపదారులు. కట్టడాలు.

కదిలాక బయట ఎండిపోయిన పొలాలు, బొగ్గుకోసం నాశ నం అయిన చెట్ల మొదళ్ళు....నలభై ఏభై సంవత్సరాలు పెరిగిన చెట్లు, బొగ్గుకోసం అన్నీ నిమిషాల్లో కొట్టి, కాల్చి, నీడని కూడా అనుభవించనీయని మానవుణ్ణి శపిస్తోన్నట్టు ఈ మెండి మొదళ్ళు.

వర్షాలు లేక ఎండిపోయిన భూమి.

అంతా వికృతం. వాటిని వెక్కి రిస్తోన్నట్టు రైలింజనుపొగ. ధూళితో కలిసి లోపలికి వొచ్చి కలిగించే బాధ.

అన్నీ నాకు తెలుస్తున్నాయి.

కాని, నా ఎదురు సీటులో కూర్చున్న ఆ ఇద్దరికీ ఇవేమీ తెలియడంలేదు....అతనూ, ఆమే, ఏదో మాటాలాడుకుంటున్నారు, చిన్న చిన్న స్వరాలతో. మధ్య మధ్య ఒకరి కళ్ళలోకి ఒకరు చూస్తూ ఆ కళ్ళ కలయికలో భాష, మాటలు అక్కరలేని ఏవో సంభాషణలు సాగిస్తున్నారు.

నాలుగు బెర్తుల ఆ కంపార్ట్‌మెంట్‌లో మేం ముగ్గురం.... నేను ఒకణ్ణీ, వా రిద్దరూను. ఆ నాలుగు కళ్ళూ కలిసినప్పుడు వాళ్ళు ఒక్కరూ, నేను శూన్యాన్నీని. ఆ క్షణాలలో నే నక్కడ ఉండక పోతే బాగుండు ననిపించింది—ఆ ఇద్దరి మధ్యా మరో ప్రపంచం లాటి నేను అక్కడ ఉండకా తప్పదు. వాళ్ళు వాళ్ల ప్రపంచంలో విహరిస్తూ ఏవో హద్దుల్లో ఆగకా తప్పదు. కాని పరిస్థితి నాకు బాధా కరంగా ఉంది.

చాలా కాలం క్రిందట ఇలాగే కలకత్తానించి మద్రాసు వెడు తూంటే మరో దంపతులతో ప్రయాణం చెయ్యాల్సి వొచ్చినది జ్ఞాపకం తెచ్చారు ఆ ఇద్దరూ— తెలుపు నలుపునిలాగ.

వాళ్లూ ఇలాగే పాతిక సంవత్సరాలకి అటూ ఇటూ ఉన్న జంట.

ఇలాగే, పిల్లలు లేకుండా, ఖరీదైన సామాన్లతో ప్రయాణం చేస్తున్నారు. ఇలాగే వాళ్లూ నాకు బాగా తెలియని భాషలో మాట్లాడు కుంటున్నారు.

కాని, అక్కడినించి అంతా వేరుకథ, అప్పుడూ నా కక్కడ ఉండాలని లేదు. దానికి కారణం రైలెక్కింది మొదలూ వాళ్ళు కీచులాడుకుంటూ ఉండడమే.

ముందర ఏసామాన్లు ఎక్కడ పెట్టాలనే విషయం మీద వాదులాట ప్రారంభించారు. పీళ్ళకూజా ఎక్కడ ఉంచాలి?

కొంచెం వాదన తరువాత ఆమెమాట గెలిచింది.

తరువాత, పళ్లబుట్ట ఎక్కడ ఉంచాలి?

ఖాళీగా ఉన్న ఒక పైబెర్తు మీద ఉంచమని ఆమె తరువాత రాత్రిఎవరైనా వొస్తే? అని అతను.

చివరికి ఆమె మాటే నెగ్గింది.

ఉదయం నిద్ర లేచాక కాఫీ దగ్గర మళ్ళీ గొడవ. ఉన్న పాటల్లో ఉన్న డికాషన్ కలిపేమని ఆమె - అది తనకి పనికిరాదని అతను.

జ్ఞాపకం లేదు ఎవరు గెలిచారో.

తరువాత అద్దం ఎత్తి ఉంచాలా? వొద్దా? అని వాదన.

స్నానం చెయ్యాలా వొద్దా?

ఇత్యాదులు?

ఆ ప్రయాణం నాకు రైలెక్కినప్పుడల్లా జ్ఞాపకం వొస్తూనే ఉంటుంది, చూచాయగా. కాని, ఈ నాడు వివరాలతో జ్ఞాపకం వొస్తూంది.

నిన్నరాత్రి వీళ్లిద్దరూ నా కంపార్ట్ మెంట్‌లోకి వొచ్చేసరికి ఆమెని నిద్ర కళ్లతో చూసినా, ఒక జ్ఞాపకపు తటిల్లత నా మెదడులో మెరిసింది— ఆ నిద్రకళ్లలోనూ, ఆమెలో కూడా అలాటి మెరుపే చూశానని నా కనిపించింది.

ఈ ఉదయం నేను లేచే సరికే ఆమె అలంకరణ ముగించుకుని అతనితో మాట్లాడుతోంది. నిన్న రాత్రి క్షణికంగా వొచ్చిన అనుమానం ఈ ఉదయం నిశ్చయంగా మారింది.

అవును - నా కామె ఎవరో తెలుసును. అంటే, ఆమెని గురించి చూచాయగా తెలుసును....మరి, ఏ వ్యక్తిని గురించి ఎవరికి పూర్తిగా తెలుస్తుందని? తమని తామే ఎరగని మనుషులు ఇతరులని గురించి ఎలాగ తెలుసు కుంటారని?

అప్పటికి రెండేళ్ళు దాటి ఉంటుందను కుంటాను _ ఒక సాయంత్రం విక్టోరియా మెమోరియల్‌కి వెళ్ళాను - ఎవరినో అక్కడ కలుసు కుందామని. ఆ సమాగమం జరుగుతుందని నాకేమీ నమ్మిక లేదు - ఉత్సాహంతో అనుభూతికోసం ఉరకలు వేసే హృదయాలు గమ్యానికి దగ్గరైన కొద్దీ పిరికితనానికి లోబడతాయని నాకు తెలుసు కనుక. కాని అదే నింద నేను నామీద వేసుకోవడం ఇష్టంలేక వెళ్లేను.

అక్కడ ఒక చెట్టుకింద కూర్చున్నాను. ఆ చెట్టు నెంబరు 86 అనుకుంటాను....సరిగ్గా జ్ఞాపకం లేదు నాకు. మరో అరగంటలోనో, గంటలోనో నేను విఫలుడనై అక్కడినించి వెళ్ళిపోతానని

తెలిసినా, చావని చిన్న ఆశని చంపే శక్తిలేని మనస్సులో నా ఆలోచనల్లో నేను కూర్చున్నాను. నేను వెళ్ళేసరికి ఆ సాయంకాలం ఆ చెట్లకింద కొంచెంమంది ఒంటరులూ, చాలా జంటలు, కొన్ని కుటుంబాలూ, అక్కడ కూర్చున్నారు. ఆహ్లాదకరంగా ఉన్న ఆ సాయంత్రం నా ఆలోచనల్నీ, నన్నూ, ఎక్కడికో తీసుకు పోయింది.

చలిగాలిలాటిది వేసి, నాకు తెలివి లాటిది వొచ్చి నే నీలోకంలో పడేసరికి అందరూ వెళ్ళిపోయారు. బాగా చీకటి పడిపోయింది. పైపైంతో అవకపోయినా ఆకాశం నల్లటి నీటిమేఘాలతో నిండి పోయింది. వర్షానికీ నాకూ మధ్య అంతగా ఏమీ లేదు.

ఉండా మనుకున్నంత కాలం ఉండకపోయినా, వర్షంలో తడవడం ఇష్టంలేక నా కారువైపు రెండడుగులు వేసేను. ఒక్కసారి, మెరుపులో, ఆమె కనిపించింది—ఒక చెట్టుకింద నిలబడి. చలికో, తనని తాను దాచుకోడానికో, ఆమె తన చీరని ఒంటిచుట్టు మరింత గట్టిగా చుట్టుకుని, గేటువైపే చూస్తూ నిలబడింది. ఆమె కళ్ళు నాకు కనిపించలేదు. ఆ చిన్న చీకటిని చీల్చి కళ్ళల్లోకి చూసే వెలుతురు బయటలేదు! నాలోనూ లేదు.

కాని, నేను అనుకోకుండానే ఆగిపోయాను.

ఆ పరిసరాల్లో మే మిద్దరమే మిగిలిపోయాము. ఆమె ఎవరికోసం చూస్తోందో! నేను లోపలికి వొచ్చేటప్పుడు ఆమె అక్కడే కూర్చుని ఉంది. ఆ మాట నాకు జ్ఞాపకం ఉంది. అప్పుడు ఆమెని మళ్ళీ చూడాలని అనిపించలేదు. వొంద మందిలో ఆమె ఒకతె. కాని, చీకటితో, వర్షపు సూచనలతో భయపెడుతోన్న ఆ క్షణాలలో కేవలం ఆమె ఒక్కతే.

ఆమె నావైపు చూడలేదు.

నేను మరొక చెట్టుకింద నిలబడ్డాను. త్వరలోనే చినుకులు పడతాయి—అప్పుడామె వెళ్తుంది. ఆ తరవాత నేనూ వెళ్ళవొచ్చును. ఈ లోపున ఆమె ధైర్యంగా అక్కడ నిలబడడమూ, నేను పలాయనం చెయ్యడమూ నాకు సరిపడలేదు. ఏమైనా, మా పరిస్థితుల్లో పోలిక ఉంది కదా!

ఎంతో తొందరగా చినుకులు రానే వొచ్చాయి—ఒక్క నిమి షంలో వాన ప్రారంభించింది.

నేను మూర్ఖుడినో, మనిషినో తెలుసుకోలేని పరిస్థితిలో అలానే నిలబడ్డాను. ఆమె రెండుమూడు సార్లు వర్షంనించి రక్షించు కునే ప్రయత్నంలో నన్ను చూపి తల తిప్పుకుని చీరని మరికొంచెం దగ్గరగా తీసుకుంది. వర్షం జోరు ఎక్కువైన కొద్దీ అమె ఛెట్టు మొదలుకి మరి కొంచెం మరి కొంచెం దగ్గరగా వెళ్ళిపోయింది. నేనూ తడుస్తున్నాను. కాని, ఆమె నాలో ఒక వెచ్చదనాన్ని కలిగిం చింది. ఎవరి కోసం ఆమె ఎదురు చూస్తుందో కాని, అతను అదృష్ట వంతుడు. ఈ పరిస్థితుల్లో ఆమె అతని కోసం ఎదురు చూసిందంటే, అమె అతన్ని ఎంత ప్రగాఢంగా ప్రేమిస్తోందో: అతనికన్నా, అమె అదృష్టవంతురాలు—అంతగా ప్రేమించ గలగడానికి, అనుకున్నాను.

నాలుగ్గంటల్లాగ అనిపించే నలభై నిమిషాలు_ఆమె కద ల్లేదు....నిమిష నిమిషానికీ ధైర్యం తెచ్చుకోడానికి లాగ, నావైపు చూడడానికి తప్ప.

నేనూ కదల్లేదు—ఆమె చూసినప్పుడు అటునించి నాకళ్లు తిప్పుకోడానికి తప్ప. నాలో ఏమీ మలిన భావాలు లేవు—ఆమె మీద ఒక అనురాగ పూరితమైన గౌరవం తప్ప.

హఠాత్తుగా చుట్టూ దీపాలు ఆరిపోయాయి. గాలి వానా వెర్రిగా భీకరంగా, ఆ పరిసరాలని వికృతంగా చేశాయి. ఆ చెట్టు క్రింద ఆమె, ఇక్కడ నేను.

ఈ వీక్షణ చివరికి అర్థరహితం అయిపోయింది నాకు. నేను నేర్చుకోవలసినది ఇంకేమీ లేనూ లేదు. ఆమె ప్రియుడి కోసం వొచ్చి, అలాగ నిలిచి ఉండటం నాకు చాలా తియ్యటి విషయంగా కనిపించింది. అతను రాకపోవడంలో చాలా అర్థాలు కనిపించాయి. కాని, ఇంక నేనక్కడ ఉండటంలో ఏమీ ప్రయోజనం లేదనిపిం చింది.

ఒక్క ఉదుటున బయలుదేరాను. ఆమె చెయ్యి నా వైపు జాపి, పరిగెట్టి ఉండకపోతే నేను ఆగి ఉండేవాణ్ణికాదు.

ఆమె నా ప్రక్కన నిలబడి, "వెళ్ళి పోతున్నారా?" అంది.

"అవును...."

"పదండి....నాకు భయంగా ఉంది...."

ఇద్దరమూ త్వర త్వరగా అడుగులు వేసుకుంటూ గేటు అవతలకి వెళ్ళేము. నేను కారు తెరిచేసరికి ఇద్దరమూ ఇంకా బాగా తడిశాము.

ఆమె ఆహ్వానం లేకుండానే లోపలికి వొచ్చి కూర్చున్నది. బయట ఇంకా భయంకరంగా అవుతోన్నట్టు అనిపించింది.

చలితో ఆమె వొణకడం చూస్తూ కారు కొంచెం సేపటిలో స్టార్టు చేశాను.

"ఎక్కడికి వెళ్ళాలి మీరు?" అన్నాను, ప్లానెటోరయమ్ వైపు వెడుతూ.

ముడుచుకు పోయి, "ఎక్కడైనా సరే, డ్రాప్ చెయ్యండి.... దీపాలున్న దగ్గర" అంది.

నే నాశ్చర్యపోయాను. నా ఉద్దేశాలన్నీ తారుమారయాయా? ఈమె కేవల నిరాశ్రయురాలు మాత్రమేనా! అనుకున్నాను. కాని, ఆమె రూపమూ, బట్టలూ....అలాగ నన్ను నిశ్చయం చేసుకోనీలేదు, కాని....ఈ మహానగరంలో అన్ని రకాలూ....

ఆమె ముఖం నిండా తడి—అది చినుకులదో, కన్నీళ్ళదో తెలియలేదు నాకు.

"నా ఇంటికి వస్తారా?" అని అడిగాను చాలా ఆలోచించుకుని. ఈమె నిరాశ్రయ అయినా, ఎవరయినా, ఒక గంట ఆశ్రయం ఇవ్వడం మానవుడిగా నా ధర్మం అనిపించింది.

ఆమె త్వరగా తల ఊపింది, "రా" నని.

"ఏం?"

"మీ వాళ్ళకి అది ఇష్టం ఉండదు."

"మా వాళ్ళు ఎవరూ లేరు-నేనే"

"అయితే....రాను"

ఆమె సందేహం అర్థమైంది.

మాట్లాడకుండా కారుతిప్పి, ఆలీపూర్‌లో నా ఇంటికి వెళ్లేను. ఆమె అలాగే వొణుకుతూ, ముడుచుకు పోతూ కూర్చుంది.

"లోపలికి రండి...." అన్నాను సర్వెంటు తీసిన తలుపు ఇంకా తీస్తూ.

బెదురుతూ ఆమె లోపలికి వొచ్చింది.

"మీరు ఒళ్లు తుడుచుకొండి... ఆ తరవాత ఒక్క క్షణం ఉండనక్కర్లేదు...." అంటూ ఆమెకి రెండు తువ్వాళ్లు ఇచ్చి బాత్ రూమ్‌కి పంపాను.

ఇరవై నిమిషాల దాకా ఆమె రాలేదు. ఈలోగా, వేడి టీ, ఫలహారాలు సిద్ధం చేయించాను—ఆమె చవక బారు మనిషికాదని నాకు రూఢి అయాక, ఆమె విషయం కొంత తెలుసుకోవా లనిపించింది. ఈ పరిస్థితిలో ఏదో విచిత్రం అయినదేదో ఉందనిపించింది.

ఆమె బయటికి వొచ్చింది. బట్టల్లో ఇంకా తడి కొంచెం తెలుస్తూనే ఉన్నా, ఆమె చాలా మారిపోయింది....తల దువ్వుకుంది. ఆమె బేగ్‌లో టాయిలెట్ సామానులన్నీ ఉన్నయిలా ఉంది. బొట్టు కూడా పెట్టుకుంది. చూడటానికి చాలా చక్కగా ఉంది.

నాహృదయం ఆ క్షణంలో చలించిన మాట నిజం. కాని, వెను వెంటనే నేను సరిదిద్దుకో గలిగాను.

"టీ తీసుకోండి...." అన్నాను.

ఆమె చిరునవ్వు నవ్వి, కూర్చుంటూ "మీరు అనవసరంగా శ్రమ పడుతున్నారు" అంది.

క్షణం క్రిందటి ఆలోచనల శకలాలు ఇంకా నా మనస్సులో ఉండి పోయాయను కుంటాను, ఆమె మాటల్లో ధ్వని నన్ను గాయ పరచింది.

"మీరు భయపడడానికి ఏమీ కారణంలేదు...." అనగానే, "నేను భయపడను, అంత సుళువుగా" అంది ఆమె.

"అయితే ఎదురు చూడకండి.... ఒక కప్పు టీ ఇచ్చి మిమ్మల్ని సెడ్యూస్ చేయాలని నేను అనుకోవడం లేదు _ కొంచెం టీ తరువాత మీ ఆలోచనలూ మారవచ్చు" అన్నాను కోపంతో.

"ధన్యవాదాలు...." అని, టీ తీసుకుని బిస్కట్ నములుతూ "మరి, న న్నెందుకు తీసు కొచ్చారు?" అంది. ఆమె కళ్ళలో చిరు నవ్వు పోలేదు.

"ఆ పరిస్థితుల్లో కుక్కని గూడా విధిలో వొందలం. కనీసం నేను...." అన్నాను.

"అంతసేపు అక్కడ ఎందుకు నిలబడ్డారు?"

"మీలాగే....మీకన్న ముందు నేను బయలుదేరానని మాత్రం మరచి పోకండి!"

ఈ సారి ఆమె నవ్వగలిగింది.

నా పేరు చెప్పి "మనం ఏడడుగుల కన్న ఎక్కువే వేశాం. ఏడు మాటల కన్న ఎక్కువే ఆడేం. మీమీద ఎలాటిపీ ప్రణాళికలు వెయ్య బోవడంలేదు. కనుక, ఈ వర్షంతగ్గేదాకా కూర్చొండి....మీ పేరు చెప్పండి" అన్నాను.

"మీరు మాట్లాడుతోంటే ఆ గాలివాన జ్ఞాపకం వొస్తూంది...." అంది ఆమె నవ్వుతూ.

"మీ పేరు"

"మానస"

ఎలాగో ఆమెకి ఆ పేరు సరిపోయిందని పించింది.

"కొన్ని అడుగుతాను-వీలైతే చెప్పండి...."

"నా పేరు బాగుందని చెప్పలేదేం?"

"అవసరం లేక!" అన్నాను.

"పెళ్ళి అయిందా?"

"లేదు"

"మరి?"

"ప్రశ్నలు నన్ను వెయ్యనివ్వండి" అన్నాను నవ్వుతో నవ్వు కలుపుతూ.

"ఏమిటి?"

"సాయంత్రం....మీరు....ఎందు కక్కడ అంతసేపు ఉండి పోయారు?"

మానస నవ్వి, "అదే మిమ్మల్ని అడగా లనిపించింది. చెప్పండి" అంది.

ఆమె కళ్ళలోకి తేరిపార చూసినా, ఆమె చిరునవ్వు పోలేదు.... ఆమె కళ్ళుదించుకోనూ లేదు.

చివరికి నేనే ఓడిపోయాను.

చెప్పేను.

"ఆమెని ప్రేమిస్తున్నారా?" అంది మానస.

"లేదు...."

"ఓ"

ఆమె టీ తాగడంలో నిమగ్నమైంది. నా ప్రశ్ననీ, ఆమె వాగానాన్నీ మరోసారి జ్ఞాపకం చేశాను.

"అతను—వొస్తాడని...."

"మరి?"

"రాలేదు—చూశారుగా?"

"ప్రేమించారా?"

"అలాగే అనుకుంటాను"

"అతను?"

"అలాగే అంటాడు...."

"మరి వర్షంవొస్తే ఇంటికి ఎందుకు పోలేదు?"

కొంచెం గంభీరంగా ఉన్న మానస చిరునవ్వుతో. "అతనికి వాగ్దానం చేశాను....కొంచెం నీటి చుక్కలకేం?" అంది.

"ప్రతిరోజూ కలుసు కుంటారా?" అన్నాను, ఉత్సుకత ఆపుకోలేక. మానస మీద క్రమంగా ఒక రకం అనురాగం కలుగుతోంది ఆ నిమిషాలలో.

"కుదురుగా....ఎప్పుడైనా....అంతే."

"అతను ఇలాగ ఆశాభంగం కలిగిస్తాడా?"

"ఆ....అతనికి వర్షమంటే భయం అనుకుంటాను. ఇంకా కారణాలూ ఉంటాయి—ఒక్కొక్కప్పుడు రాలేక పోతాడు."

ఆమె కంఠంలో బాధ కాని, కోపం కాని, ఏమీలేదు–కాని, ఆమె కళ్ళలో చిరునవ్వూ. క్షణంపాటు, లేదు.

''మరి?''

''ఏమిటి?''

''మీరు– మీరు మాత్రం వాగ్దానం భంగం చెయ్యరు''

''చెయ్యను....''

''అతని ప్రవర్తన మెచ్చుకోలేను – మిమ్మల్ని మెచ్చుకున్నట్టు?''

మానస నవ్వింది.

''మేము పోటీ చెయ్యడం లేదుగా....ప్రేమించుకుంటున్నాం?'' అంది.

అప్పటికి ఎనిమిదిన్నర అవుతోంది.

మానస లేచి, ''నేను వెడతాను-వర్షం తగ్గుతోంది'' అంది.

''ఎక్కడికి?'' అని అడిగాను.

''ఇంటికి''

''ఎక్కడ?''

''భవానీపూర్‌లో....''

''వర్షం ఇంకొంచెం తగ్గనివ్వండి....''

''టైమయిపోతోంది''

''దేనికి?''

''నేను సినిమాకి వెళ్తానని చెప్పి వొచ్చాను...''

నేను ఆమె మాట వినకుండా కారు తీసుకుని ఆమెని జగూబజార్ దగ్గరకి తీసికెళ్ళి, ఆ పైన ఆమె మరీ వొద్దనడం వల్ల దింపేను.

దిగుతూ, ''మీకు నమస్కారాలూ, ధన్యవాదాలూ....'' అంది నవ్వుతూ.

''అక్కరలేదు....''

"మంచివారు మీరు.... పెద్ద హృదయం మీది... ఎవరినన్నా ప్రేమించండి!'' అంటూ మానస వీధి దీపాల వెలుతురులోకే, పడుతూనే ఉన్న చినుకుల్లోకే మాయం అయిపోయింది.

ఆ తరవాత నేను మానసని చూడలేదు....

నాక్కావలసిన వాళ్ళని విక్టోరియా మెమోరియల్‌లో కలుసుకునే అలవాటూ మానేశాను. మానసలో ఉన్న ఆ చలించని ప్రేమకి అయిన తావుని నారాక పోకలతో కలుషితం చెయ్య కూడ దనిపించింది నాకు.

ఆమెని మళ్ళీ చూడలేదు నేను- ఈ రోజు దాకా.

చూడాలని ప్రయత్నమూ చెయ్యలేదు. కాని, మళ్ళీ అనుకోకుండా ఇలాగ కలిసే దాకా, ఆమెని మరిచిపోనూ లేదు. ఆమె జ్ఞాపకంలో నాకు సంతృప్తి ఉండేది. చాలా గౌరవమూ ఉండేది.

ఇదంతా జ్ఞాపకం వొస్తుంటే, రైలు సాగి పోతూనే ఉంది. సౌందర్యరహితమైన ప్రకృతీ, సౌందర్యరహితమైన మనుష్యుల పనీ కళ్ళకీ, ముక్కుకీ, మనస్సుకీ బాధ కలుగజేస్తూనే ఉన్నాయి.

మానసని గమనించకుండా జాగ్రత్తపడి బయటికి చూడక తప్పలేదు....అతన్ని మాత్రం చాలా సార్లు గమనించకా తప్పలేదు- అతను అదృష్టవంతుడు....అనుకున్నాను. ఆ సాయంత్రం ఉదంతం అంతా జ్ఞాపకం తెచ్చుకుని.

మెయిల్ వాల్తేరు వొచ్చేక అతను దిగి బయటికి వెళ్ళాడు- నిమిషం ఆగి మానస నాకు నమస్కరిస్తూ, "ధన్యవాదాలు. మీరు చాలా అద్భుతంగా ప్రవర్తించేరు .... ఆయనికి అనుమానం ఎక్కువ!'' అంది.

"కాని, చాలా అదృష్టవంతుడు!" అన్నాను.

మానస తల ఊపింది. చిరునవ్వు కోసం ఎదురుచూశాను. రాలేదు.

"ఇప్పటికైనా అతనికి వర్షం అంటే భయం తగ్గిందా! అన్నాను, ఏదో ఒకటి అనడానికి. మాకు దొరికిన కొద్ది క్షణాలు నిశ్శబ్దంలో వృథా అయిపోవడం నా కిష్టం లేదు.

ఈ సారీ మానస నవ్వలేదు.

"ఈయన....మా వాళ్ళు తెచ్చిన సంబంధం-అతను కాదు!

అంది.

"మరి?....ఏం జరిగింది?" అన్నాను, నిర్ఘాంతపోయి. వాళ్లిద్దరికీ పెళ్లి కాలేదంటే నాకు గొప్ప ఆశాభంగం కలిగినట్లయింది!

ఆమె జవాబు చెప్పేలోగా అతను వొచ్చి "ప్రక్కనకూపే లోకి పోదాం" అంటూ పోర్టరుకి సామాన్లు చూపసాగాడు. అతని కోరిక ప్రకారం మానస ముందు వెళ్ళింది.

త్వరలో కంపార్టుమెంట్ అంతా ఖాళీ అయిపోయింది.

మళ్ళీ మానస వెళ్ళిపోయింది.

నాకు వెయ్యి ఆలోచనలు వొచ్చాయి.

అంతగా ప్రేమించిన మానస ఇతన్ని ఎలాగ చేసుకుంది?

భారతదేశపు కన్యల బాధలే ఆమె పీని-అయిఉంటాయి.

అయితే అతన్ని అంతగా ఎలాగ ప్రేమించ గలుగుతోంది?

అలాగ వొంద ప్రశ్నలు. జవాబులేనివి.

కాని, చివరిగా వొచ్చి నన్ను మరీ బాధించిన ప్రశ్న ఒక్కటి....

ఆనాడు మానస నిజంగా 'అతని' కోసం ఎదురు చూపిందా?

ఆ ప్రశ్నకి ఏ జవాబునీ నా మనస్సు అంగీకరించ లేకపోయింది.

దానికి నాలో ఉన్న చాలా లోపాలలో ఏదో ఒకటి కారణం అనుకుంటాను.

—o—